ఆరోగ్యానికి పాగబెడుతున్నారు!!

- రావణకాష్టంలా మారిన నాదెండ్ల డంపింగ్ యార్డు
- అనారోగ్య సమస్యలొస్తున్నాయని స్థానికుల ఆవేదన
- చర్యలు తీసుకోవాలంటూ వినతి



క్వారీకుంటలో పంచాయతీ ట్రాక్టర్‌తో పడవేస్తున్న చెత్త



వ్యర్థాల నుంచి వెలువడుతున్న దట్టమైన పాగ

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామానికి డంపింగ్ యార్డు ఉన్నా గ్రామంలో ఉత్పత్తయ్యే చెత్తను హిందూ శ్మశాన వాటిక పక్కనే ఉన్న క్వారీ కుంటలో వేస్తుండటంతో స్థానికులకు తీవ్ర సమస్యలు ఎదురౌతున్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో పంచాయతీ ట్రాక్టర్లతో చెత్తను క్వారీ కుంటలో పడవేస్తున్నారు. చెత్తలోని ప్లాస్టిక్, ఇతర వస్తువులను కొందరు వ్యక్తులు ఏరుకుని, ఆపై వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. దీంతో దట్టమైన పాగ వెలువడి పక్కనే ఉన్న బీసీ కాలనీ వాసులను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. రాత్రి పగలూ తేడా లేకుండా రావణకాష్టంలా కాలుతూ గాఢమైన వాసనతో కూడిన పాగ వస్తుండటంతో చిన్నా పెద్దా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో నిద్రపోయే సమయంలో పాగ కారణంగా ఊపిరి తీసుకోలేని పరిస్థితి నెలకొంటోంది. దగ్గు, శ్వాస సంబంధ సమస్యలకు గురౌతున్నారు. చిన్నారులు, వృద్ధులైతే నిద్రపోలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొందరు వ్యక్తులు విద్యుత్‌వైర్లు దగ్ధం చేసి అందులోని రాగి తీగను తీసుకెళ్తున్నారు. ప్లాస్టిక్ వైర్లు కాలే సమయంలో వెలువడే పాగ కారణంగా క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం కూడా నెలకొంది. గ్రామ పంచాయతీకి కుప్పగంజి వాగుకు ఆనుకుని డంపింగ్ యార్డు ఉన్నా, సరైన నిర్వహణ లేకపోవటంతో స్థలం నిండిపోతోంది. దీంతో ఇక్కడ సైతం వ్యర్థాలను దగ్ధం చేస్తున్నారు. దీంతో అటు ప్రజలకు, ఇటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోంది.

చిన్నారులకు ఊపిరి ఆడటం లేదు



పది రోజులుగా క్వారీ కుంటలో వ్యర్థాలు వేసి తగులబెట్టడంతో రాత్రి పగలు తేడా లేకుండా పాగ కమ్మేస్తోంది. దీంతో చిన్నా పెద్దా అందరికీ ఇబ్బందిగా ఉంది. చిన్నారులైతే ఏడుస్తూ నిద్ర కూడా పోవడం లేదు. పాగ కారణంగా ఊపిరి తీసుకోవటంలో ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కొత్తపల్లి సుబ్బాయమ్మ, స్థానికురాలు.

రోగమొస్తే నయం చేసుకోలేం!



కూలి నాలీ చేసుకుని సాయంత్రానికి ఇంటికి చేరుతాం. చెత్త తగలబెడటంతో వస్తున్న పాగ కారణంగా ప్రశాంతంగా నిద్ర కూడా పోలేకపోతున్నాం. పాగతో జబ్బుల పాలైతే వైద్యం కూడా చేయించుకోలేని ఆర్థిక స్థితి మాది. కాలనీలో పేదలు ఎక్కువగా ఉన్నారు. పాగతో రోగాలొస్తే కష్టాలు తప్పవు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– పల్లపు శివమ్మ, స్థానికురాలు.

వ్యర్థాలు దగ్ధం చేసేవారిపై చర్యలు తీసుకుంటాం

కుప్పగంజివాగు పక్కన ఉన్న డంపింగ్ యార్డు పూర్తి స్థాయిలో నిండిపోవటంతో కొద్దిరోజులుగా పంచాయతీ ట్రాక్టర్లలో చెత్తను క్వారీ కుంటలో పడేస్తున్నాం. ఇకపై వ్యర్థాలు వేయకుండా నియంత్రిస్తాం. వ్యర్థాలను దగ్ధం చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నివారిస్తాం.

– మారుతిబాబు, పంచాయతీ కార్యదర్శి, గణపవరం.

సమస్యల పరిష్కారంలో అధికారుల పాత్ర కీలకం

- సమావేశానికి డుమ్మా కొడితే ఎలా?
- శావల్యాపురం ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని



మాట్లాడుతున్న ఎంపీపీ సుహాసిని

శావల్యాపురం: ప్రజాసమస్యలు పరిష్కరించడంలో అధికారులు కీలకపాత్ర పోషించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి అన్నీ శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొని ప్రజాసమస్యలపై చర్చించాల్సి అవశ్యకత ఉండగా కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరు కావటం మిగిలిన వారందరూ డూమ్మా కొట్టటం మంచి విధానం కాదన్నారు. సర్వసభ్య సమావేశానికి సంబంధించి అన్నీ శాఖల అధికారులకు ఎంపీడీవో సారథ్యంలో ముందుగానే సమాచారం అందిస్తున్నా నామమాత్రంగా హాజరు కావటాన్ని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

మండలంలోని 15 గ్రామపంచాయతీలు ఉండగా నలుగురు సర్పంచులు, ఆరుగులు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. ఇక నుంచి జరగనున్న సర్వసభ్య సమావేశాన్ని అన్నీ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు హాజరయ్యే విధంగా క్షేత్రస్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షణ చేయాలన్నారు. ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 9864 నివాస గృహాలు ఉండగా ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో సమగ్ర వివరాలన్నీ పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు త్వరితగతిన తయారు చేయాలన్నారు. అనంతరం ఆయా శాఖల వారీగా అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు విధివిధానాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి, తహసీల్దారు కె.సుజాత, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఈవోపీఆర్‌డి. పి.సుగుణ.ఏవో రామినేని రామారావు, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

34వ వార్డు ప్రత్యేక డ్రైవ్‌లో ఎమ్మెల్యే చదలవాడ



బీసీ కాలనీలోని డ్రెయిన్‌లో పూడిక తీస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. శనివారం పట్టణంలోని 34 వార్డు బీసీ కాలనీలో నిర్వహించిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో మునిసిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం శ్రమ చేస్తున్నారన్నారు. దీనికి ప్రజల సహకారం కూడా చాలా అవసరం ఉందన్నారు. ఇళ్లముందున్న డ్రెయిన్లలో చెత్త, చెదారం వేయటం ద్వారా మురుగునీరు ఆగిపోయి దోమలు వృద్ధి చెంది రోగాలు వస్తాయని హెచ్చరించారు. పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి కాలువలో పూడిక తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీ, పారిశుద్ధ్య కాంట్రాక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు పశుపోషకులు సహకరించాలి

పశువైద్యాధికారి గణేష్‌కుమార్



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పశువైద్యాధికారి

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామపంచాయతీలో అఖిల భారత పశుగణన సర్వే కార్యక్రమం జరుగుతుందని పశువైద్యాధికారి పాలపర్తి గణేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పశుగణన సర్వే అక్టోబరు 25 నుంచి ప్రారంభం కాగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందన్నారు. మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో పశుసహాయకులు పశుగణన చేస్తారన్నారు. ప్రతి ఇంటినీ సందర్శించి పశువుల సంఖ్యతో పాటు సమగ్ర సమాచారాన్ని సేకరించి డిజిటల్ ఫారం నందు ఆన్‌లైన్ నమోదు చేస్తారన్నారు. ఈ వివరాలన్నీ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన భారత్ పశుధన్ పోర్టల్ నమోదు అవుతుందన్నారు. ఈ పశుగణన కార్యక్రమం ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి జరుగుతుందన్నారు. పశుగణన సర్వే ద్వారా ఆరోగ్య పథకాలు, పశుసంరక్షణ, రాయితీలపై ప్రభుత్వాలు సులభతరంగా అర్హత కల్గిన రైతులకు మేలు జరేగే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. పశుగణన సర్వే కార్యక్రమంలో పశుపోషకులు సహకరించాలన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలో 18 వేల పశువులు ఉన్నాయన్నారు. పశుగణన సర్వే అనంతరం ప్రతి ఇంటికి ముఖద్వారానికి ఒక వైపున స్టిక్కర్ అంటిస్తారన్నారు.

మద్యం తాగ వద్దన్నందుకు ఉరేసుకున్నాడు!

చిలకలూరిపేటటౌన్: పదేపదే మద్యం సేవించినందుకు భార్య ప్రశ్నించినందుకు భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మార్కాపురంకు చెందిన కేశవపట్నం రామకృష్ణ, రంగమ్మ దంపతులు రెండు నెలల కిందట చిలకలూరిపేటకు వచ్చారు. స్థానిక వడ్డెరపాలెంలో ఉంటూ పెదనందిపాడు రోడ్డులోని రైస్‌మిల్లులో రామకృష్ణ మిషన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో రామకృష్ణ శనివారం మద్యం సేవించి వీధిలో పడి ఉండటాన్ని చూసి స్థానికులు ఇంటికి తీసుకువచ్చారు. తర్వాత మళ్లీ మద్యం సేవించడంతో కుటుంబ సభ్యులు అస్తమానం తాగి పడిపోవడం ఏంటని ప్రశ్నించారు. దీంతో మనస్తాపం చెందిన రామకృష్ణ (44) ఇంట్లో ఫ్యాన్‌కు చీరెతో ఉరెసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేడు కోటప్పకొండలో రెడ్డి సంఘీయుల వనసమారాధన

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ యోగివేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, రెడ్ల సత్రంలో ఈనెల 23వ తేదీ ఆదివారం రెడ్డి సంఘీయుల కార్తిక వనసమారాధన నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. వన సమారాధనకు ధర్మవరం మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి శ్యామల, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్ రెడ్డిలు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వివరించారు. సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు సామూహిక సత్య వ్రతాలు

చిలకలూరిపేట (యడ్లపాడు): కార్తిక మాసం చివరి ఆదివారం పురస్కరించుకుని శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాన్ని ఏర్పాటు చేసినట్లు అయ్యప్పస్వామి దేవస్థానం కమిటీ తెలిపారు. పట్టణంలోని ఓగేరువాగు దక్షిణ దిశగా ఉన్న అప్పయ్య స్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు ఈ వ్రతం ప్రారంభం అవుతుందన్నారు. దంపతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ముందుగా తమ పేర్లను కమిటీ వద్ద నమోదు చేసుకోవాలని, వ్రతంలో పాల్గొన్న భక్తులకు పూజా ద్రవ్యాలతో పాటు మధ్యాహ్న భోజనం సదుపాయాన్ని కల్పించినట్లు వెల్లడించారు.

నేడు ఆర్యవైశ్య కార్తిక వనసమారాధన

శావల్యాపురం: మండలంలోని బొందిలి పాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి సన్నిధిలో మండల ఆర్యవైశ్యుల సారథ్యంలో కార్తిక మాస వనసమారాధన వేడుకలు ఆదివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి గట్టుపల్లి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని ఆర్యవైశ్యుల సారథ్యంలో 14వ వనసమారాధన వేడుకలు సందర్భంగా మండలంలోని ఆర్యవైశ్య కుటుంబాలకు చెందిన వారందరు ఈకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం అన్నదానం కూడా ఏర్పాటు చేశామన్నారు.

మహిళలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ

సినీ నటుడు నరేష్



విలేకరులతో మాట్లాడుతున్న సినీ నటుడు నరేష్,

నరసరావుపేట ఈస్ట్: మహిళలలు ఆత్మరక్షణ చేసుకునేందుకు అవసరమైన పోరాట విద్యలలో శిక్షణను న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా అందిస్తుందని సినీ నటుడు, ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షుడు నరేష్ తెలిపారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వతేదీన నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో 38వ వార్షిక సౌత్ ఇండియా ఆల్‌స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సినీ నటుడు నరేష్ మాట్లాడారు. ఇప్పటికే తమ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. మార్షల్ ఆర్ట్స్‌ను ప్రతి ఒక్కరికీ పరిచయం చేసేందుకు న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

నరసరావుపేటలో జన్మించి బాల నటిగా, హీరోయిన్‌గా, దర్శకురాలిగా గిన్నీస్ రికార్డు సాధించిన మహిళగా పేరు ప్రఖ్యాతులు సాధించిన విజయనిర్మల విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయటంతో పాటు ఆమె విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉన్నట్టు తెలిపారు. సమావేశంలో న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.రవి, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.రాజశిఖామణి, హాండ్స్ ఆఫ్ కంపాషన్ డైరెక్టర్ ఆనంద్‌బెంజ్‌మన్ పాల్గొన్నారు.

శావల్యాపురం యూటీఎఫ్‌కు నూతన కార్యవర్గం



పామర్తి సురేష్ | గుడ్లూరి ప్రసాదు

శావల్యాపురం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండలం శాఖ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగినట్లు యూటీఎఫ్ జిల్లా నాయకులు డి.రవికుమార్ తెలిపారు. నూతన అధ్యక్షులుగా పామర్తి సురేష్ (శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల) ప్రధాన కార్యదర్శిగా గుడ్లూరి ప్రసాదు (శానంపూడి ఎంపీపీ స్కూలు) మహిళా సహ అధ్యక్షురాలుగా బి.భువనేశ్వరి, సహాధ్యక్షులుగా మల్లావరపు బాబురావు, కోశాధికారిగా కోలుసు వీరాంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా యూత్ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్, ఎన్నికల పరిశీలకులు పోలయ్య, మండల గౌరవ అధ్యక్షులు మాదాల రామకోటేశ్వర రావులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదుకు ఒక్క అర్జీ

యడ్లపాడు: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం శనివారం మండలంలో నిర్వహించారు. మండలం పరిధిలోని 58 నుంచి 114వ నంబర్ల వరకు గల 57 పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలు ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉన్నారు. ఆయా బూత్‌ల ద్వారా నిర్వహించిన ప్రత్యేక ఓటరు కార్యక్రమంలో మండలం నుంచి ఒకే ఒక దరఖాస్తు వచ్చిందని తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. ఫారం 6 ద్వారా కొత్త ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. అలాగే ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిరిగి బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని, ఓటర్ల జాబితాలో సవరణలు, తొలగింపులు, కొత్త ఓటర్ల నమోదు చేసుకోవచ్చన్నారు.

'పల్లె పండగ' పనుల నాణ్యత తనిఖీ

ముప్పాళ్ళ: పల్లె పండుగలో చేపట్టిన పనులన్నీ డిసెంబర్‌కు చేయాలని సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శాంతారావు పేర్కొన్నారు. మండలంలోని ముప్పాళ్ళ, మాదల గ్రామాల్లో జరుగుతున్న సిమెంట్ రోడ్లు, సీసీ డ్రెయిన్స్ పనులను శనివారం పరిశీలించారు. మండలంలో 25 మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయని, ఇందులో 15 పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ ప్రభాకరరావు, ఎన్ఆర్ఈజీఎస్ పీఆర్ ఏఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాల్వలో బాలిక మృతదేహం వెలికితీత



కావ్య మృతదేహం

వినుకొండ: ఈపూరు మండలం ముప్పాళ్ల మేజర్ కాలువలో గల్లంతైన కావ్య (7) శనివారం ఉదయం గజ ఈతగాళ్లు మృతదేహాన్ని వెలికి తీశారు. గత రెండు రోజుల క్రితం ఈపూరు మండలం వనికుంట గ్రామానికి చెందిన యామిని, కావ్య ఇరువురు బాలికలు ఎస్ఎస్‌పీ కాలువలో గల్లంతయ్యారు. యామిని మృతదేహం శుక్రవారం బయట పడగా కావ్య మృతదేహాన్ని శనివారం వెలికి తీశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేటలో యువతి అదృశ్యం

నరసరావుపేటటౌన్: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయ్ చరణ్ శనివారం తెలిపారు. రామిరెడ్డిపేటకు చెందిన 19 ఏళ్ల యువతి డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆమె కనిపించకుండా పోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు యువతి తల్లి ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

నరసరావుపేట రూరల్: యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్ఎస్‌పీ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం .. రొంపిచర్ల మండలం నల్లగార్లపాడుకు చెందిన గంటా మునిరాజు (28) గత కొన్ని సంవత్సరాలుగా కుటుంబసభ్యులకు దూరంగా నివసిస్తున్నాడు. కాలనిలోని వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నాడు. శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో రూరల్ ఎస్ఐ కిశోర్ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి ఆత్మహత్యకు కారణాలపై విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో వినుకొండ నియోజకవర్గ స్థాయి పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో జుప్రల్లా హాజరై విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను పరిశీలించి అభినందించారు. 120 మంది విద్యార్థులు సైన్స్ నమూనాలను తయారు చేశారు, 40 టీంలు క్విజ్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ బి.వి.నాగేశ్వరరావు, భారతి బీఈడీ కళాశాల డైరెక్టర్ గాలి శ్రీనివాసరావు, రిటైర్డ్ హెచ్ఎం భాగవతుల రవికుమార్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ, ప్రిన్సిపాల్ శ్రీవల్లి పావని తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో సత్యసాయి జయంతి



నాదెండ్ల: గణపవరంలో కొలువైయున్న శ్రీ షిర్డీ సాయి దేవాలయంలో సత్యసాయిబాబా జయంతి వేడుకలు శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని అలంకరించి కాగడ హారతి, అభిషేకాలు, సుప్రభాత సేవలు నిర్వహించారు. భక్తులు సత్యసాయి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పూజారి బిట్టు శర్మ ఆధ్వర్యంలో పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి ఆలయంలో గణపవరం నాగరాజ భజన సమాజం వారిచే భజనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు నరిశెట్టి చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన తహసీల్దారు



శావల్యాపురం: మండలంలోని ముండ్రువారి పాలెం, శానంపూడి, బొందిలిపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు కె.సుజాత శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సుజాత మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు పోలింగ్ కేంద్రాల పరిధిలో 18 సంవత్సరాల నిండిన వారందరు నూతన ఓటు హక్కు దరఖాస్తులు బీఎల్‌వోలు తీసుకుంటారన్నారు. వీఆర్వోలు అదెయ్య, మల్లెల రాధ, బీఎల్‌వో లు బాలకృష్ణ, బసవరాజు, మహిళా పోలీసు సుబ్బాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మస్తాన్ షరీఫ్‌కు అభినందన



నరసరావుపేట: టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మీరావలి కుమారుడు, ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ మస్తాన్‌షరీఫ్‌ను కోడెల శివరామ్ శనివారం అభినందించారు. షరీఫ్‌కు ఆంధ్రా యునివర్సిటీ 'ఆక్యుపేషనల్ స్ట్రెస్ అండ్ ఇట్స్ ఇన్‌ఫ్లూయెన్స్ ఆన్ వర్క్ లైఫ్ బాలెన్స్ అమాంగ్ టీచర్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసిన విషయం విదితమే. కార్యక్రమంలో మీరావలి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టికి డాక్టరేట్



నరసరావుపేట: పట్టణంలో యువజన నాయకుడిగా తన ప్రస్థానం ప్రారంభించి వ్యాపార రంగంలో తనకంటూ ఒక గుర్తింపు పొందిన బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణకు డాక్టరేట్ లభించింది. శనివారం హైదరాబాదులోని హోలీ స్పిరిట్ ఆడిటోరియంలో హెచ్ఎస్‌సీ యూనివర్సిటీ చైర్మన్ బిషప్ ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు. 2020నుంచి పార్టీ పట్టణ అధ్యక్షుడుగా ఉంటూ 2023లో నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టి పార్టీని ముందుకు నడిపిస్తూ సనాతన ధర్మ పరిరక్షణకై నడుం బిగించి సేవా, సామాజిక,ధార్మిక రంగాల్లో ఆయన చేస్తున్న కృషికి గాను ఈ సత్కారం లభించినట్లు నాయకులు తెలియచేశారు.

ఎన్ఈసీలో రక్తదాన శిబిరం



నరసరావుపేట రూరల్: ఎన్‌సీసీ డే సందర్భంగా నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదానశిబిరాన్ని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో 60మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 23వ ఆంధ్రా బెటాలియన్ సూచనలు మేరకు రక్తదాన శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. అత్యవసర సమయంలో రక్తం అందక ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. రక్తదానం చేయడం వలన అటువంటి వారి ప్రాణాలను కాపాడినవారు అవుతారని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పీవీఎం శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దామాషా ప్రకారం సెలవులివ్వాలి

శావల్యాపురం: ఎండాకాలం సెలవుల్లో జరిగిన పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ డ్యూటీలలో ఉన్న వారికి దామాషా ప్రకారంగా సంపాదిత సెలవులు ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం మంజూరు చేయాలని మండల విద్యాశాఖాధికారి మద్దికుంట సాంబశివరావుకు యూటీఎఫ్ మండల అధ్యక్షులు పామర్తి సురేష్, మండల ప్రధాన కార్యదర్శి గూడ్లూరి ప్రసాదులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసరావుపేట డివిజన్

99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)

Office mail : sakshigntadvt@gmail.com